కూటమి చెరలో మున్సిపల్ స్థలం

- 300 గజాలు ఆక్రమించేందుకు కుట్ర
- గతంలో మున్సిపల్ పార్కు
- ఖాళీ స్థలాన్ని అనుకుని శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవస్థానం
- ఎన్నికల కోడ్ సమయంలో ఇటీవల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

నెహ్రూనగర్: పట్టణంలోని శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులోని మున్సిపల్ రిజర్వు స్థలాన్ని ఆక్రమించేందుకు కూటమి నేతలు కుట్ర పన్నుతున్నారు. గత సంవత్సరం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండగానే అక్కడ దేవుడి పేరుతో గుడి నిర్మాణం, దాని పక్కనే కల్యాణ మండపం నిర్మించి డబ్బులు దండు కునేందుకు కుయుక్తులు పన్నారు. గత సంవత్సరం మే 27, 28వ తేదీల్లో గుడి నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో అప్పటి నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆక్రమణను అడ్డుకున్నారు. పోలీస్ బందోబస్తుతో అక్కడ చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయించారు. అయితే, కూటమి నేతలు స్థలాన్ని దక్కించుకునేందుకు పావులు కదిపారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉండగానే గుడి స్థలంలో నవగ్రహాలు ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత మెల్లగా పక్కనే ఉన్న కార్పొరేషన్ స్థలాన్ని కబ్జా చేసేందుకు కుట్ర పన్నుతున్నారు.


రిజర్వు స్థలంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి (ఫైల్)

1976లో స్థలం కేటాయింపు

శ్రీనివాసరావుపేటలో 1976లో సుమారు 3600 గజాల రిజర్వు స్థలం ఉంది. ఆనాడు చేబ్రోలు హనుమయ్య మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో శ్రీ వైకుంఠ శ్రీనివాసమూర్తి దేవాలయం నిర్మాణానికి గానూ 1600 గజాలను అయ్యప్ప అనే పురోహితుడికి కౌన్సిల్ తీర్మానం చేసి కేటాయించారు. అయితే, దీనికి ఆనాడు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదని అధికారులు చెబుతున్నారు. గుడిని అనుకుని సుమారు 300గజాలకు పైగా మున్సిపల్ రిజర్వు స్థలం ఉంది. మిగిలిన స్థలంలో వాకింగ్ ట్రాక్, రిజర్వాయర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆఫీస్ ఉంది. గతంలో ఇక్కడ పార్కు కూడా ఉండేది.

కూటమి నేతల కుట్రలు

సదరు రిజర్వు స్థలంపై కూటమి నేతల కన్ను పడింది. దాన్ని అక్రమించుకుని వ్యాపారం నిర్వహించేందుకు కుట్రలు పన్నారు. ఇప్పుడు స్వయంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిని తీసుకు వచ్చి నవగ్రహాల పేరుతో శంకుస్థాపన చేయించారు. అసోసియేషన్ పేరిట స్థలంలో కల్యాణ మండపం కట్టి దాని మీద వచ్చే ఆదాయం తీసుకునేందుకు కూటమి నేతలు కుట్ర పన్నారు. మున్సిపల్ రిజర్వు స్థలాలను కాపాడుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంపై పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

అనుమతులు లేకుండానే నిర్మాణం

ప్రస్తుతం రిజర్వు స్థలంలోనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉంది. నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. కౌన్సిల్ తీర్మానం లేదు. అధికారుల దృష్టిలో కూడా లేదు. కాని అధికారం ఉందనే అండతో మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసేందుకు కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటాం

స్థలంలో శంకుస్థాపన చేసిన విషయం నాకు తెలియదు. దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్వర్లు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ

క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సాహితీవేత్త పి.ఎస్.ఆర్.ఆంజనేయ ప్రసాద్ జయంతిలో భాగంగా బుధవారం గజేంద్ర మోక్షంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేశారు. ఏనుగు అంటే జీవుడని, కర్మ బంధాలలో అతడికి లభించే విడుదల గజేంద్రమోక్షమని తెలిపారు. ఇది భగవంతుని అనుగ్రహంతో మాత్రమే లభిస్తుందని పేర్కొన్నారు. జీవుడు అహంకారం వదిలేసి, పరమాత్మను ఆశ్రయిస్తే ఆ అనుగ్రహం లభిస్తుందన్నారు. ఇదే గజేంద్ర మోక్షం కథ సారాంశమని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పి.రవికిశోర్, పి.హైమానంద పాల్గొన్నారు.

సత్యదేవుని నగరోత్సవం



నగరంపాలెం: స్థానిక పట్టాభిపురం శ్రీ కంచి కామకోటి పీఠ హరిహర దత్త క్షేత్రంలో శ్రీరమాసత్యనారాయణస్వామి 48వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చనలు నిర్వహించారు. అనంతరం నిత్య హోమం, బలిహరణ, శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి మన్యు సూక్తంతో అభిషేకం, సిందూరార్చన విశేషంగా జరిపారు. సాయంత్రం సత్యదేవుని నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పారుపల్లి శ్రీరంగనాథ్ బృందం స్వరార్చన చేయగా, ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా కోర్టును పరిశీలించిన న్యాయ విద్యార్థులు



గుంటూరు లీగల్: స్థానిక జేసీ లా కాలేజీలో మూడో సంవత్సరం న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు బుధవారం గుంటూరు జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాసు వెంకటరెడ్డి భారత రాజ్యాంగం, దాన్ని అమలుపరచు విధానం, ఐపీసీ, సీఆర్పీసీ, సీపీసీ స్థానంలో వచ్చిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ చట్టాల గురించి వివరించారు. జడ్జిల పనితీరును గమనించి, భవిష్యత్తులో మంచి న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆయన సూచించారు. విద్యార్థుల సందేహాలను పలువురు న్యాయవాదులు తీర్చారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం



పట్నంబజారు: రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లోని తిక్కన కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గుంటూరు రీజియన్ మేనేజర్ ఎం. రవికాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకి రక్తదానం గొప్పదని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడి తీవ్ర రక్తస్రావమైన వారికి రక్తదానం చేయడం అంటే ఆ కుటుంబానికి అండగా నిలవటమేనని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది బ్లడ్ గ్రూప్‌ను కూడా పొందుపరిచేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొత్తం 38 మంది ఆర్టీసీ సిబ్బంది రక్తదానం చేశారు. రీజియన్ మేనేజర్ వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ ప్రాథమిక పాఠశాల తనిఖీ

పొన్నూరు: మండలంలోని పెద ఇటికంపాడు మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరుశాతం పెంచాలని తెలిపారు. త్వరలో జరిగే ఎఫ్ఏ-4 పరీక్షలకు సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. నూర్జహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంలో లక్ష్మణరావు విస్తృత ప్రచారం


స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న లక్ష్మణరావు

లక్ష్మీపురం: నగరంలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉదయం గుజ్జనగుండ్ల, ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్సును కలిశారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటివరకు నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్రను పోషించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా ఇదే పాత్ర పోషించడం కోసం తనను ఎన్నుకోవాలని కోరారు. రైతాంగం నుంచి విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగుల, సమస్యలను శాసనమండలిలో వారి గొంతుగా గళం వినిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు, జిల్లా అధ్యక్షులు యు. రాజశేఖర్, జిల్లా సహాధ్యక్షరాలు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

కమిషనర్ పులి శ్రీనివాసులు


ప్రజారోగ్య అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దని, ఇంటింటి చెత్త సేకరణ, డ్రైయిన్ల శుభ్రం తప్పనిసరిగా జరగాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ప్రజారోగ్య విభాగ అధికారులు, కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే పారిశుద్ధ్య పనులపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరాలకు తగిన విధంగా కార్మికుల రేషనలైజేషన్ చేయాలని, డివిజన్ల వారీగా వివరాలు అందించాలని ఎంహెచ్ఓ, సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో మరింతగా పర్యవేక్షణ చేయాలని చెప్పారు. తన పర్యటనల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రేడ్ లైసెన్స్‌లపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

నగరంలో డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్సులు తక్కువుగా ఉన్నాయని, ఈ నెల 15లోపు సచివాలయాల వారీగా సమగ్ర నివేదిక కమిషనర్ ఆదేశించారు. నగరంలో ట్రేడ్ లేకుండా కమర్షియల్ సంస్థలు ఉండడానికి వీల్లేదని, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో సీఎంఓహెచ్ఓ డాక్టర్ పి.జె. అమృతం, ఎంహెచ్ఓ రవిబాబు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, వెటర్నరీ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, శానిటరీ సూపర్వైజర్లు ఆయూబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించండి

షబ్ ఈ బరాత్ పండుగ సందర్భంగా ముస్లిం శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్, ప్రజరోగ్యాధికారులను ఆదేశించారు. సంగడిగుంటలోని బుధవారం ముస్లిం శ్మశానవాటికను ఆయన పరిశీలించారు. గురువారం పండుగ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలోని ముస్లిం శ్మశానవాటికల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, షామియానా, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. మౌలిక వసతుల కల్పనకు పర్యవేక్షణకు ఎమినిటీ కార్యదర్శులను కేటాయించాలని చెప్పారు. ఆయన వెంట డెప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ సుందరరామిరెడ్డి, ఏడీహెచ్ శ్రీనివాస్, డీసీపీ సూరజ్ కుమార్, ఆర్వో సాదిక్ బాషా పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగ నిర్వహణపై పరిశోధనలు అవసరం


రామ్మోహన్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు ఆటోమేషన్, ఏఐ ద్వారా విద్యుత్ వినియోగ నిర్వహణపై శాస్త్రీయ పరిశోధనలు జరపాలని సౌత్ కొరియా కేఎన్‌యూ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మల్లిపెద్ది రామ్మోహన్ తెలిపారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం 'ఎనర్జీ డిసాగ్రిగేషన్ సొల్యూషన్ మెథడ్స్ అండ్ అప్లికేషన్' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ సాధనే లక్ష్యంగా వివిధ దేశాల్లో నిర్వహిస్తున్న పరిశోధనలు, నూతన ఆవిష్కరణల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ మల్లిపెద్ది రామ్మోహన్ తమ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగ పూర్వ విద్యార్థి కావడం అభినందనీయమని అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్ మద్దినేని కొనియాడారు. విద్యుత్ పొదుపులో భాగంగా జరుపుతున్న పరిశోధనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటూ విదేశాలు కూడా సహకారం అందిస్తూ, ఆర్థిక ప్రోత్సాహాన్ని కూడా కల్పిస్తున్నారని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు, కె. చంద్రశేఖర్, కె. స్వర్ణశ్రీ, కె. రాధారాణి పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

పెదకాకాని: పొలం యజమాని ప్రమేయం లేకుండానే అర్హత కలిగిన కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి పి. జగన్నాథం కోరారు. ఈ మేరకు కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెదకాకాని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం జగన్నాథం మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి పథకాలు, బ్యాంకు రుణాలు అందటం లేదని తెలిపారు. కార్డులు కావాలంటే భూ యజమాని సంతకం చెయ్యాలని అధికారులు అడుగుతున్నారని, పంటలు కూడా మద్దతు ధరలు దక్కకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయి కౌలు రైతులు అతి చిన్న వయసులోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. గడచిన ఎనిమిది నెలల కాలంలో 97 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, వారిలో ఎక్కువగా కౌలు రైతులే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పెదకాకాని సీపీఐ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్ రాజు, పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి పాల్గొన్నారు.

చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జాగర్లమూడి మురళీమోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం కళాశాలల అధ్యాపకులకు 28వ చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరంతరం పాఠ్యాంశాల బోధనలో తలమునకలయ్యే అధ్యాపకులకు ఆటలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని తెలిపారు. కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రమౌళి మనవడు మాస్టర్ చంద్రమౌళి పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జాగర్లమూడి చంద్రమౌళి, నరేంద్రనాథ్, మాస్టర్ చంద్రమౌళి చిత్రపటాలకు నివాళులర్పించారు. పోటీలను కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, ప్రిన్సిపాల్ పి. గోపీచంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. సాంబశివరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్కే ప్రసాద్, జేసీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. సుధాకర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

- ఉదయం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల బీ జట్టు–వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత 20 ఓవర్లకు 99 పరుగులతో ఎస్ఆర్‌కేఆర్ కళాశాల జట్టు విజయం సాధించింది.
- మధ్యాహ్నం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఏ జట్టు – వీఎస్ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల జట్టు మధ్య జరిగిన మ్యాచ్‌లో 31 పరుగుల తేడాతో ఎస్ఆర్‌కేఆర్ ఏ జట్టు గెలుపొందింది.

ల్యాబ్ ఆన్ వీల్స్ ద్వారా ప్రయోగాలపై అవగాహన


సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర, ఎలక్ట్రానిక్స్ విభాగ విద్యార్థులు బుధవారం స్తంభాలగరువులోని చేబ్రోలు పుల్లయ్య–మహాలక్ష్మి, పట్టాభిపురంలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు భౌతిక శాస్త్ర, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు సంబంధించి 'ల్యాబ్ ఆన్ వీల్స్' కార్యక్రమం ద్వారా సైన్స్ ప్రయోగాలపై ప్రత్యక్ష పద్ధతిలో అవగాహన కల్పించారు.పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మానవ జీవితంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల ఉపయోగం, భౌతిక శాస్త్ర విలువలు, ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం సోలార్ సిస్టం, రాకెట్స్ ప్రయోగంతో పాటు అంతరిక్షంలో గ్రహాల పనితీరు, ఎలక్ట్రానిక్స్ పరికరాలతో ప్రయోగాత్మకంగా విద్యార్థులకు వివరించారు. ప్రయోగాత్మక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.భాను మురళీధర్, అధ్యాపకులు రేణుక, వేణు, బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శనగలో చీడపీడలపై అప్రమత్తత అవసరం


శనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు

అబ్బినేనిగుంటపాలెం(కాకుమాను): రబీలో శనగ పంట సాగు చేస్తున్న రైతులు చీడపీడలు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు సూచించారు. పెదనందిపాడు మండలంలోని అబ్బినేని గుంటపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శనగ రైతులు పంటపై కాయ తొలుచు, కుంకమ తెగులు ఆశించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఇవి పంట పూత,పిందె దశలో కనిపించే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. తెగుళ్లు కనిపించిన వెంటనే పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుధారాణి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

పెదకాకాని: రైతులంతా విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి తెలిపారు. మండలంలోని అనుమర్లపూడి, తంగెళ్లమూడి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమర్లపూడి సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ స్వంత భూమి కలిగిన ప్రతి రైతూ ఈ– ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయించుకోవాలని తెలిపారు. గుర్తింపు కార్డు వల్ల రైతులకు పీఎం కిసాన్ పథకం, బ్యాంకు రుణాలు, పెట్టుబడి, వ్యవసాయ పరికరాలపై రాయితీలు వంటి వివిధ రకాల సబ్సిడీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తాయని వివరించారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్, పట్టాదారు పాసు పుస్తకం గానీ 1-బీ అడంగల్ ఫొటోస్టాట్‌లు తీసుకు వెళ్లి, రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ విధానం ద్వారా ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఆర్‌వీ శివాజీ, ఎస్. వెంకటశివరావు, వి.ఎ.ఎ.వై గోపి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను తొలగించ వద్దు మహాప్రభో !



పెదకాకాని: విద్యా వ్యవస్థలో తీసుకు వచ్చిన మార్పులను సాకుగా చూపించి ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలను తొలగించవద్దని నివాసితులు అధికారులను వేడుకొంటున్నారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు ఎస్సీ కాలనీలో 42 సంవత్సరాల నుంచి ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తున్నారు. ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థులతో పాటు పక్కనే ఉన్న ఈబీసీ కాలనీ పిల్లలు కూడా చదువుకుంటున్నారు. ప్రస్తుత విద్యా సంస్కరణల్లో బాగంగా ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 3, 4, 5 తరగతులు విద్యార్థులను జిల్లా పరిషత్ పాఠశాలకు పంపించే ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టినట్లు కాలనీ వాసులకు సమాచారం అందింది. దీనిపై మంగళవారం పాఠశాల పేరెంట్స్ కమిటీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఇక్కడే కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం పెదకాకాని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణను కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఈబీసీ కాలనీవాసులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాలవ్యకు బుధవారం నగర కమిషనర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. గతంలో ప్రజారోగ్య విభాగంలో ఎఫ్- 4 గా పనిచేసిన మాలవ్య రిటైర్‌మెంటు బెనిఫిట్స్ కోసం డబ్బులు తీసుకున్నాడని, వాటిని ఇప్పించాలంటూ ఓ విశ్రాంత ఉద్యోగి కమిషనర్ పులి శ్రీనివాసులను కలిసి ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా వివరణ ఇవ్వాలంటూ మాలవ్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ప్రజా సమస్యలపై మండలిలో గళం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో గళం విన్పిస్తానని ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుమ్మా శ్రీనివాస యాదవ్ తెలిపారు. బుధవారం పొన్నూరు రోడ్డులోని కార్యాలయంలో మేనిఫెస్టోను విడుదల చేశారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు యేటా సివిల్స్, గ్రూప్-1, 2, డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ, మోడల్ పరీక్షల నిర్వహణతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యే విధంగా పర్యవేక్షిస్తానని తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా తాను 11 అంశాల మేనిఫెస్టోతో ప్రజల్లోకి వెళుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ విద్యార్థుల విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో గుంటూరు ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ జనరల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని కళాశాల క్యాంపస్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో తమ విద్యార్థి వల్లేల నాగ సిద్ధార్థ 99.97 పర్సంటైల్ సాధించి కళాశాల కీర్తి, ప్రతిష్ఠలను జాతీయస్థాయిలో నిలిపినట్లు చెప్పారు. డెప్యూటీ జనరల్ మేనేజర్లు గోవర్ధన్‌రెడ్డి, వెంకటరమణ మాట్లాడుతూ గుంటూరు బ్రాంచ్ నుంచి ఐదుగురు విద్యార్థులు 99 పైన పర్సంటైల్ సాధించారని చెప్పారు. 98 పర్సంటైల్ పైన 10మంది, 95 పర్సంటైల్ పైన 50 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. తాడిపత్రి తేజస్ ఉద్భవరెడ్డి 99.83, దేవగిరి కార్తిక్ సత్య సాయి కుమార్ రెడ్డి 99.37, కోలిశెట్టి సాయి భవాని సందీప్ 99.36, కటకం నిఖిల్ 99.24, బోరుగడ్డ రాజీవ్ చరీఫ్ 99.14 సాధించారని తెలిపారు.

చదువుతో పాటు ఆటలపై ఆసక్తి అవసరం

కాకుమాను: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని ఆయా రంగాల్లో రాణించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ తెలిపారు. కాకుమాను మండల పరిషత్ (స్పెషల్)ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలనే ఉద్దేశంతో పాఠశాల ముగిసిన తరువాత ప్రతి రోజు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ దిశగా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు



గుంటూరు రూరల్: నగరంలోని 48వ డివిజన్ రెడ్డిపాలెంలో గల శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి దేవస్థానంలో 13వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు గత మూడు రోజులుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చివరిరోజు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పసుపు కుంకుమార్చనలు, హోమాలు జరిపారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని అర్చకుల వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో 15 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ స్పిరిచ్యువల్ సర్వీస్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.